సాక్షి
అనంతపురం

మంగళవారం, 14, మార్చి, 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.4.50, సరాసరి రూ.7 పలికింది.


గరిష్టం/కనిష్టం

36.9°/15.7°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం పూట చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



రాప్తాడు రూరల్: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలల విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సాయిరాం తెలిపారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్యశాఖ సరఫరా చేస్తుందని తెలిపారు. ఏడాది వయసు నుంచి 19 ఏళ్లలోపు వయసున్న పిల్లలు, విద్యార్థులందరూ ఈ మాత్ర తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

రేపే ఇంటర్ పరీక్షలు



సీసీ కెమెరాల పనితీరును పరిశీలిస్తున్న అధికారులు

రాప్తాడురూరల్: ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో 63,090 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అనంతపురం జిల్లాలో 60 కేంద్రాల్లో 41,186 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 17,319 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,280 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 20,977 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,610 మంది ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 39 కేంద్రాల్లో 21,904 మంది హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 8,299 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,008 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 11,169 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,428 మంది ఉన్నారు. అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది.

స్టోరేజీ పాయింట్లకు ప్రశ్నపత్రాలు

అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన మూడు సెట్ల (1, 2, 3) ప్రశ్నపత్రాలను స్టోరేజ్ పాయింట్లకు (పోలీసు స్టేషన్) తరలించారు. అనంతపురం జిల్లాలో 23, శ్రీసత్యసాయి జిల్లాలో 20 స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

పరీక్షలు రాసే విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. 9 గంటలు దాటిన తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతించరు. విద్యార్థులకు ఏ చిన్న సమస్య తలెత్తినా ఆర్ఐఓ కార్యాలయంలోని కంట్రోల్ రూంలోని 08554-277626 నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

ఏర్పాట్లు పూర్తి

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశాం. ఉదయం 8.30 గంటలకంతా విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి చేరుకోవాలి. ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయొచ్చు. – సురేష్‌బాబు, ఆర్ఐఓ

పోలింగ్ ప్రశాంతం

- పోటెత్తిన ఓటర్లు
- పట్టభద్రుల ఓటింగ్ 74.67 శాతం
- ఉపాధ్యాయ ఓటింగ్ 92.21 శాతం

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొని తమ ఓటు వేశారు. కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వర్తించారు. ఈ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 74.67 శాతం, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి 92.21 శాతం ఓట్లు నమోదయ్యాయి. పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో 3,30,124 మందికి గాను 2,45,103 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 28,148 మందికి గాను 25,884 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



అనంతపురంలోని కేఎస్ఆర్ కళాశాల పోలింగ్‌కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ పెట్టెలు

అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు సంబంధించిన బ్యాలెట్ పెట్టెలు జేఎన్‌టీయూ కళాశాలకు చేరాయి. మిగిలిన ఐదు జిల్లాల బ్యాలెట్ బాక్స్‌లు మంగళవారం చేరనున్నాయి.

పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ...

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎన్నికల ఆర్ఓ, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప, అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షించారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన వెబ్ క్యాస్టింగ్ ద్వారా జిల్లావ్యాప్తంగా జరిగిన పోలింగ్ సరళిని పరిశీలించారు. కలెక్టర్, ఎస్పీ, అసిస్టెంట్ కలెక్టర్ నగరంలోని పలు కేంద్రాలను సందర్శించి పోలింగ్ తీరును గమనించారు.

పోలింగ్‌కు పటిష్ట చర్యలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పోలీసు ఉన్నతాధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టారు. కళ్యాణదుర్గం, ఉరవకొండ, వజ్రకరూరు, గుంతకల్లు, ఆత్మకూరు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు.



వెబ్ క్యాస్టింగ్ ద్వారా పోలింగ్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫకీరప్ప

జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఇలా...

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	పోలింగ్ శాతం
కర్నూలు	5,391	4,868	2,729	2,139	90.03
నంద్యాల	4,426	4,161	2,631	1,530	94.01
అనంతపురం	5,564	5,110	3,207	1,903	91.84
శ్రీసత్యసాయి	3,348	3,104	2,168	936	92.71
వైఎస్సార్	7,461	6,813	3,954	2,859	91.31
అన్నమయ్య	1,958	1,828	1,246	582	93.36
మొత్తం	28,148	25,884	15,935	9,949	92.21

జిల్లాల వారీగా పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ఇలా...

జిల్లా	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	పోలింగ్ %
కర్నూలు	61,633	43,944	30,581	13,363	-	71.03
నంద్యాల	54,929	42,310	30,241	12,068	1	77.03
అనంతపురం	68,341	52,136	35,506	16,629	1	76.29
శ్రీసత్యసాయి	43,310	32,623	22,714	9,909	-	75.00
వైఎస్సార్	81,317	58,927	38,560	20,366	1	72.01
అన్నమయ్య	20,594	15,163	10,525	4,637	1	73.63
మొత్తం	3,30,124	2,45,103	1,68,127	76,972	4	74.67



ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి ఉషశ్రీచరణ్



ఓటు వేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి



అనంతపురంలో ఓటు వేస్తున్న మహిళ



అనంతపురంలో ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపుతున్న మహిళలు

నమో నారసింహా..





రథంలో కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- వైభవంగా ఖాద్రీశుని బ్రహ్మ రథోత్సవం

కదిరి: గోవింద నామ స్మరణతో కదిరి మార్మోగింది. భక్తుల జయజయ ధ్వానాల మధ్య ఖాద్రీ లక్ష్మీ నారసింహుని బ్రహ్మరథోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. రథోత్సవం ముగిసే వరకూ భక్తులంతా 'నమో..నారసింహ' అంటూ కీర్తించగా ఖాద్రీశుని నామంతో కదిరి పట్టణం ప్రతిధ్వనించింది.

ఉదయం 8.11 గంటలకు కదిలిన రథం

బ్రహ్మోత్సవాల్లో లక్ష్మీ నారసింహుడు తిరు వీధుల గుండా విహరించేందుకు దేవతలు రోజూ ఒక్కో వాహనాన్ని పంపుతారని, బ్రహ్మరథోత్సవం నాడు సాక్షాత్తు బ్రహ్మ దేవుడే రథాన్ని నడిపి శ్రీవారు తిరువీధుల్లో విహరించేందుకు సహకరిస్తారని భక్తులు నమ్ముతారు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం పూజల అనంతరం రథం 8.11 గంటలకు ముందుకు కదిలింది. ఆ సమయంలో తిరువీధులు భక్తుల గోవింద నామ స్మరణలతో మార్మోగాయి. సరిగ్గా మధ్యాహ్నం 1.24 గంటలకు రథం యథాస్థానం చేరుకుంది. అక్కడక్కడా తిరువీధుల్లో రథం పలు ఇళ్లతో పాటు విద్యుత్ స్తంబాలను తాకుతూ వచ్చింది. మహాత్మాగాంధీ చౌక్‌లో కాసేపు, అలాగే హిందూపూర్ సర్కిల్‌లో సుమారు 45 నిమిషాల పాటు రథం ఆగిపోయింది. మొత్తం మీద తిరువీధుల్లో శ్రీవారు బ్రహ్మ రథంపై విహరించడానికి మొత్తం 5.15 గంటలు పట్టింది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి తక్కువ సమయమే పట్టింది. ఈసారి చిన్న చిన్న అవాంతరాలు మినహా రథోత్సవం దిగ్విజయంగా సాగింది.

రథోత్సవంలో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే

ఆలయ అర్చక బృందం ఉదయాన్నే తేరు ముందు బలిహరణం, ఆస్థాన పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సిద్దారెడ్డి తొలి పూజల్లో పాల్గొని, తర్వాత రథంపై ఆశీనులైన స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన రథోత్సవాన్ని ప్రారంభించారు.



అశేష భక్త జనసందోహం నడుమ సాగుతున్న లక్ష్మీనారసింహుని తేరు

లోడు పెరిగింది

- కోటాకు మించి విద్యుత్ వినియోగం
- మార్చి తొలిపక్షంలోనే రోజువారీ 22 మిలియన్ యూనిట్లకు
- ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో గృహ వినియోగం రెట్టింపు
- అర్బన్ ప్రాంతాల్లో ఇప్పటికే మొదలైన ఏసీల వాడకం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఎండలు మండుతున్న కొద్దీ కరెంటు వినియోగం మరింతగా పెరిగింది. మార్చి మాసం తొలి పక్షం గడవక ముందే ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు 22 మిలియన్ యూనిట్ల కరెంటు వినియోగం జరుగుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేయచ్చు. రానురాను ఇది మరింతగా పెరిగే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. వినియోగం పెరుగుతున్నా ఇప్పటివరకూ ఎక్కడా కరెంటు కోతలు లేవు. ఈ మాసంలో రోజువారీ వినియోగం దాదాపు మూడు మిలియన్ యూనిట్లు అదనంగా పెరిగింది.

కోటా దాటిపోయింది

ఉమ్మడి అనంతపురం జిల్లాకు నెలకు 613.986 మిలియన్ యూనిట్ల కోటాగా ఎస్పీడీసీఎల్ కేటాయించింది. ఈ లెక్కన రోజుకు 19.806 మిలియన్ యూనిట్లు మాత్రమే వినియోగం కావాలి. ఈ కోటా ఎప్పుడో దాటింది. కోటాకంటే రెండు నుంచి మూడు మిలియన్ యూనిట్లు ఎక్కువగా వినియోగం అవుతున్నట్టు తేలింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల మధ్య భారీగా లోడు పడుతోంది. ఏప్రిల్, మే నెలల్లో రోజువారీ 30 మిలియన్ యూనిట్లకు చేరుకున్నా ఆశ్చర్యపోయేపరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు.



వినియోగం పెరుగుతోందిలా..

ఫిబ్రవరి 15న పగలు ఓ మోస్తరు ఎండలున్నా రాత్రి పూట చలి వణికించేది. ఆ తర్వాత వాతావరణంలో మార్పు వచ్చింది. ఉక్కపోతకు తట్టుకోలేక చాలా మంది ఏసీలు వేస్తున్నారు. కార్యాలయాలు, కార్పొరేట్ ఆఫీసుల్లో సైతం ఏసీలు మొదలయ్యాయి. ఇక ఫ్యాన్‌లు 24 గంటలూ పని చేయాల్సిందే. దీంతో ఒక్కసారిగా గృహ వినియోగంలో రోజూ మిలియన్ యూనిట్లలో తేడా కనిపిస్తోంది. మరోవైపు ఎంఎస్‌ఎంఈలు, మధ్య తరహా పరిశ్రమలు పెరుగుతున్నకొద్దీ వినియోగం ఎక్కువవుతోంది. అనంతపురం జిల్లా ఉద్యానపంటలకు ప్రసిద్ధి. ఏడాది పొడవునా బోర్లు నడుస్తూనే ఉంటాయి కాబట్టి నిరంతరం కరెంటు అవసరం ఉంటుంది. దీనివల్ల కూడా కరెంటు వినియోగం జిల్లాలో ఎక్కువగా ఉంది.

మార్చి నెలలో కరెంటు వినియోగం

తేదీ	వినియోగం (మిలియన్ యూనిట్లలో)
1	21.470
2	20.497
3	20.894
4	20.542
5	21.340
6	21.493
7	22.046
8	22.242
9	21.470
10	22.090
11	22.310
12	22.450
13	22.451

అనంతపురం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో...

వ్యవసాయ కనెక్షన్లు	ఇతర సర్వీసులు
1,67,407	6,93,113

హిందూపురం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో..

వ్యవసాయ కనెక్షన్లు	ఇతర సర్వీసులు
1,43,798	6,09,459

ఏడాదికి వ్యవసాయ సబ్సిడీ వ్యయం రూ.1837.47 కోట్లు

కోటాకు మించి వ్యయం

మనకు కేటాయించిన కోటా కంటే రోజూ 3 నుంచి 4 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఎక్కువగా వ్యయం అవుతోంది. ఉద్యాన పంటల శాతం ఎక్కువగా ఉండటం, గృహ వినియోగం పెరగడమే దీనికి కారణం. కోటాకు మించి వ్యయం చేస్తున్నా ఎక్కడా కరెంటు కోతలు లేకుండా చర్యలు చేపట్టాం. గృహ, పరిశ్రమలు, రైతులు ఇలా ఎవరికీ ఇబ్బంది లేకుండా చూస్తున్నాం.

– సురేంద్ర, ఎస్ఈ, ఎస్పీడీసీఎల్


ఆడియో మార్చి అభాండాలా..?

- బీసీ మహిళ మంత్రిగా ఎదగడం ప్రతిపక్షాలకు మింగుడుపడటం లేదు
- మీడియాతో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: 'ఒక బీసీ మహిళ మంత్రిగా ఎదగడం ప్రతిపక్షాలకు మింగుడుపడటం లేదు. నేనంటే ఓర్వలేని వారు ఆడియో (వాయిస్) మార్చి అభాండాలు వేస్తున్నారు. ఇంతటి దౌర్భాగ్య పరిస్థితుల్లో టీడీపీ ఉండటం సిగ్గుచేటు' అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. సోమవారం ఆమె కళ్యాణదుర్గంలో మీడియాతో మాట్లాడారు. గతంలో రాష్ట్ర మంత్రి హోదాలో మొట్టమొదటిసారి జిల్లాకు వచ్చినప్పుడు కూడా ప్రతిపక్షాలు వివాదం సృష్టించాయని గుర్తు చేశారు. తన కాన్వాయ్ ట్రాఫిక్ వల్ల ఓ చిన్నారి మృతి చెందిందని డ్రామాలకు తెరలేపారన్నారు. అయితే వాస్తవాలు తెలుసుకున్నాక ముక్కున వేలేసుకుని మిన్నకుండిపోయారన్నారు. నియోజకవర్గంలో ఇటీవల ప్రభుత్వ నిబంధనల మేరకు తన సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన భూమిని కూడా కబ్జా అంటూ ఆరోపణలు చేశారన్నారు. తనపై దుష్ప్రచారం చేయడంలో భాగంగానే ప్రస్తుతం కూడా వివాదానికి తెర లేపారన్నారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల జాబితా, మెజార్టీపై పార్టీ నాయకులతో చర్చిస్తుండగా వీడియో తీసి.. డబ్బుతో ప్రలోభాలకు తెర లేపారంటూ తన వాయిస్‌ను వక్రీకరించారని మండిపడ్డారు. టీడీపీ వారు ఇంతటి నీచానికి దిగజారడం సిగ్గుచేటన్నారు. గతంలో ఇదే నియోజకవర్గంలో వాల్మీకి నేత గోళ్ల బాదన్న తన వాదనను వినిపిస్తే అదే టీడీపీ వారు అతన్ని ఏం చేశారో, ఏం జరిగిందో ప్రజలంతా గమనించారన్నారు. ప్రస్తుతం కురుబ సామాజిక వర్గానికి చెందిన తనపై తప్పుడు ప్రచారం చేస్తూ టీడీపీ పబ్బం గడుపుకుంటోందని మండిపడ్డారు. వెనుకబడిన వారు పదవుల్లో ఉండి ఏదైనా మాట్లాడితే అది నచ్చని కొన్ని చానళ్లు, కొన్ని పత్రికలు బురదజల్లడం పనిగా పెట్టుకున్నాయన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్ వ్యవహారంలో రామోజీరావుపై కేసులు కూడా నమోదయ్యాయని, దీని గురించి ఎవరైనా, ఎక్కడైనా మాట్లాడుతున్నారా అంటూ మంత్రి ఘాటుగా ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీకి నష్టం చేకూర్చడమే టీడీపీ, కొన్ని పత్రికల పని అని మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.








రాయదుర్గంలో ఓటు వేస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి


అనంతపురంలో ఓటు వేసి వస్తున్న ఎంపీ తలారి రంగయ్య దంపతులు


ఓటు వేస్తున్న అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి


ఓటు హక్కు వినియోగించుకున్న శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరి సాంబశివారెడ్డి


గుత్తిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

సజావుగా ఎమ్మెల్సీ పోలింగ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. కొత్తగా నమోదైన ఓటర్ల మొదలు వృద్ధుల వరకూ ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప సుడిగాలి పర్యటన సాగిస్తూ పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అనంతపురంలోని పాతూరు నంబర్-2 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, కోర్టు రోడ్డులోని నెహ్రూ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఎంపీ తలారి రంగయ్య, రాయదుర్గంలోని రాధాకృష్ణ మున్సిపల్ పాఠశాలలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, బుక్కరాయసముద్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

- అనంతపురం సిటీ:


ఓటు హక్కు వినియోగించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


అనంతపురంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


ఓటు వేస్తున్న ఎస్కేయూ వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి


ఓటు హక్కు వినియోగించుకున్నట్లు చూపుతున్న దివ్యాంగుడు


కళ్యాణదుర్గంలో రెండు నెలల వయసున్న చంటి బిడ్డతో కలసి ఓటు వేసేందుకు వచ్చిన బాలింత


అనంతపురంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లతో ముచ్చటిస్తున్న శాసనమండలి విప్ వెన్నపూస గోపాలరెడ్డి


అనంతపురంలోని ఓ కేంద్రంలో సజావుగా సాగుతున్న ఓటింగ్


గుంతకల్లులోని ఓ కేంద్రంలో అస్వస్థతకు గురైన ఓటరుకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

మైనర్ అదృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని కురువల్లి గ్రామానికి చెందిన ఓ మైనర్ అదృశ్యమైనట్లు ఎస్ఐ శివ తెలిపారు. . కురువల్లి గ్రామానికి చెందిన బాలిక మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బాలిక తల్లి కామాక్షి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా ప్రసాద వితరణ


ఆలయం వద్ద నైవేద్యంగా ఉంచిన ప్రసాదం


భూతప్ప ప్రతిమలను అలంకరించిన దృశ్యం

రొళ్ల: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం భూతప్ప ఆలయం వద్ద 101 ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో సమర్పించిన బియ్యం, బెల్లం, బ్యాళ్ల ఇతర పదర్థాలను కలిపి ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని భూతప్ప ఆలయం వద్ద నైవేద్యంగా ఉంచి, పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామున లక్ష్మీ సమేత నరసింహస్వామి మూలవిరాట్‌ను వెండి, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు, పూలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా భూతప్ప స్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లి ప్రసాద వితరణ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. కాగా, మంగళవారం సాయంత్రం ఉత్సవాలు ముగియనున్నాయి.

వైభవంగా సామూహిక షష్టి పూర్తి మహోత్సవం



షష్టి పూర్తి వేడుకల్లో పాల్గొన్న 60 జంటలు

గుంతకల్లు టౌన్: స్థానిక రైల్వే గ్రౌండ్ లక్ష్మీగణేశ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 60 జంటలకు షష్టి పూర్తి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గుంతకల్లు పరిసర ప్రాంతాలకు చెందిన 60 నుంచి 69 ఏళ్ల లోపు ఉన్న దంపతులు హాజరయ్యారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, శాస్త్రోక్త పూజల అనంతరం సామూహిక షష్టి పూర్తి మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సురేష్‌గుప్త, కార్యదర్శి వీఎల్ గుప్త, కోశాధికారి దేవేంద్ర, పారిశ్రామిక వేత్త సత్రసాల జగదీష్ గుప్త, అర్చకులు పార్థసారథి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీడీఎస్ ఉద్యోగాలకు ఎంపిక జాబితా విడుదల

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని తపాలా డివిజన్లలో ఖాళీగా ఉన్న జీడీఎస్ ఉద్యోగాలకు సంబంధించి ఎంపికైన వారి జాబితాను ఆ శాఖ కేంద్ర కార్యాలయ అధికారులు సోమవారం విడుదల చేశారు. పదో తరగతి అర్హతతో ఎలాంటి రాత పరీక్ష లేకుండా, మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ జాబితాను తపాలా శాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అనంతపురం డివిజన్‌లో 80 మంది, హిందూపురం డివిజన్‌లో 98 మంది ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా తపాలా డివిజన్ కార్యాలయాల్లో వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన రెండు సెట్ల జిరాక్స్ కాపీలను ఆయా కార్యాలయాల్లో సమర్పించాలి.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతురాలు సుబ్బమ్మ


మృతి చెందిన నక్క

- నక్క కూడా మృత్యువాత

పావగడ: రోడ్డుకు అడ్డంగా వచ్చిన నక్కను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ మహిళతో పాటు నక్క కూడా మృతి చెందింది. ప్రత్యక్షసాక్షి బాలరాజు తెలిపిన మేరకు... రామగిరి మండలం గరిమేకలపల్లికి చెందిన గొల్ల సుబ్బమ్మ (45) తన కుమారుడు బాలరాజుతో కలసి ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై భీమలనకుంటికు బయలుదేరారు. కుమారుడు ద్విచక్ర వాహనం నడుపుతుండగా వెనుక తల్లి కూర్చొని ప్రయాణం చేస్తోంది. మార్గమధ్యంలోని తిమ్మమ్మనహళ్లి సమీపంలోకి చేరుకోగానే చీకట్లో రోడ్డుకు అడ్డంగా నక్క పరుగున వచ్చి ద్విచక్ర వాహనం కిందపడి మృతి చెందింది. ఘటనతో వాహనం అదుపు తప్పి కిందపడిన సుబ్బమ్మ అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఘటనపై వైఎస్ హొసకోట పోలీసులు కేసు నమోదు చేశారు. నక్క కళేబరాన్ని అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని ఖననం చేశారు.



క్లుప్తంగా

మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

అనంతపురం టవర్‌క్లాక్: మొల్లమాంబ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కుమ్మర శాలివాహన ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఓబుళపతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో మొల్ల మాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఓబుళపతి మాట్లాడుతూ దాదాపు 583 సంవత్సరాల క్రితమే మొల్ల మాంబ సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదించారన్నారు. కార్యక్రమంలో రామాంజినేయులు, శ్రీనివాసులు, లక్ష్మన్న, వెంకటరాముడు, సతీష్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'నాటునాటు'కు ఆస్కార్‌పై హర్షం

అనంతపురం కల్చరల్: దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు నాటు పాట ఆస్కార్ అవార్డు అందుకోవడం పట్ల అనంత కళాకారులు హర్షం వెలిబుచ్చారు. ఈ మేరకు వేర్వేరు ప్రకటనల్లో అభినందనలు తెలిపారు. ఎల్కేపీ కళాకారులు, అనంత సంగీత సినీ కల్చరల్ కమిటీ తరఫున మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకరబాబు, ఘంటసాల స్మారక కమిటీ సభ్యులు పాలసముద్రం నాగరాజు, జీవీ రామయ్య, పాత పాటల ప్రేమికుల సంఘం అధ్యక్షులు ఓబులదాసు తదితరులు మాట్లాడుతూ తెలుగువారికి సమున్నత గౌరవాన్ని తెచ్చిపెట్టిన ప్రతి కళాకారుడిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు తెలిపారు.

భాగవత సప్తాహం ప్రారంభం



భాగవత సప్తాహం చేస్తున్న ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: లోక కల్యాణం కోసం వారం రోజుల పాటు సాగే భాగవత సప్తాహం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక అశోక్‌నగర్‌లోని స్వామి వివేకానంద పార్కులో భాగవత సమాజం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో భాగవత సప్తాహానికి ప్రత్యేక పూజలతో శ్రీకారం చుట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భాగవతంలోని ఘట్టాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఇండ్ల శౌరిరెడ్డి, మేకల నారాయణస్వామి, అశ్వర్థనారాయణ, విశ్వేశ్వరరెడ్డి, కోటి మల్లేశు తదితరులు మాట్లాడుతూ ఈనెల 20 వరకు సప్తాహం సాగుతుందన్నారు. అలాగే, ప్రతిరోజు సాయంత్రం ఆయుర్వేద వైద్య శిబిరంలో అన్ని వర్గాల వారికి వైద్య సలహాలు, సూచనలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తరిమెల రమణా రెడ్డి, ఆదినారాయణరెడ్డి, చంద్రశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండు ఆర్టీసీ బస్సుల ఢీ

- నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు



గార్లదిన్నె: మండల కేంద్రానికి సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంతకల్లు డిపోకు చెందిన బస్సు అనంతపురమునకు వెళ్తుండగా లోలూరు క్రాస్ స్పీడ్ బ్రేకర్ వద్దకు రాగానే బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న డోన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: కాకినాడ వేదికగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్లో అనంత క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 11న నిర్వహించిన క్రీడా పోటీల్లో... జిల్లా నుంచి మహిళల ఫాయిల్ విభాగంలో త్రివేణి, గీతిక, జాస్పర్, పూజలు స్వర్ణ పతకాలు, ఇప్పి విభాగంలో పుష్ప, ముస్కాన్, అమీనా, సాదియాలు కాంస్య పతకాలు సాధించారు. పురుషుల సాబర్ విభాగంలో రవికుమార్, అనిల్‌కుమార్, చిన్మయిశ్రీ వాస్తవ్‌లు స్వర్ణ పతకాలను, వ్యక్తిగత ఉమెన్ ఇప్పి విభాగంలో పుష్ప స్వర్ణ పతకాన్ని, అమీనా కాంస్య పతకాన్ని, ఇప్పి పురుషుల విభాగంలో ప్రతాప్ రజత పతకాలను సాధించారు. వీరిని స్థానిక అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో జిల్లా చీఫ్ కోచ్ వెంకటరమణ, జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ, పీడీ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

పోలింగ్ నమోదైందిలా..	
నగరంలో మొత్తం కేంద్రాలు	31
మొత్తం ఓటర్లు	21,337
ఓటు వినియోగించుకున్నవారు	15,727
ఉదయం 10 గంటలకు..	3,101
మధ్యాహ్నం 12 గంటలకు	6,956
2 గంటలకు	10,521
4 గంటల వరకూ	15,727 మంది
పురుషులు	9,707
మహిళలు	6,020



ఓటు వేయడానికి వెళ్తున్న పట్టభద్రులు



సప్తగిరి సర్కిల్‌లో పోలింగ్ సందర్భంగా కోలాహలం

పోటెత్తిన ఓటర్లు

- కిక్కిరిసిన పోలింగ్ కేంద్రాలు
- నగరంలో 73.71 శాతం పోలింగ్



ఓటు హక్కు వినియోగించుకున్న మేయర్ వసీం



ఓటేసిన డిప్యూటీ మేయర్ కోగటం దంపతులు



ఓటేసిన డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య



సిరా గుర్తు చూపుతున్న కమిషనర్ భాగ్యలక్ష్మి



అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్



వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్ గౌడ్..

అనంతపురం క్రైం: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచే పట్టభద్రులు ఓటు వేయడానికి బారులు తీరారు. సాధారణ ఎన్నికలను తలపించేలా పోలింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. మహిళలు చంటి బిడ్డలను ఎత్తుకుని మరీ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వినియోగించుకున్నారు. నగరంలోని 31 బూత్‌లలో 73.71 శాతం నమోదైంది.

క్షుణ్ణంగా తనిఖీ..

జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు శాఖ ప్రశాంతంగా ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు. నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో ఎవరూ సెల్‌ఫోన్ తీసుకెళ్లకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. పోలింగ్ బూత్ ప్రారంభంలోనే పోలీసులు, మహిళా పోలీసులు ఓటర్లను తనిఖీ చేసి లోపలికి పంపారు. రాజేంద్ర నగరపాలక పాఠశాల, కేఎస్‌ఆర్ కళాశాలలో నడవలేని స్థితిలో ఉన్న పలువురిని పోలీసులు మోసుకుని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లి ఓటు వేయించేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే ఓటింగ్ జరగాల్సి ఉంది. కానీ కేఎస్‌ఆర్ కళాశాలలోని పలు బూత్‌లలో ఓటర్లు బారులు తీరడంతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు నాలుగు గంటలకు గేట్లు మూసి వేశారు. బూత్‌లలో ఉన్న ఓటర్లకు అధికారులు టోకన్లు అందించి ఓటు వినియోగించుకునేలా చర్యలు తీసుకున్నారు.

బీజేపీ నాయకుల ఓవరాక్షన్..

ప్రశాంతంగా ఓటింగ్ జరుగుతున్న సమయంలో 122 బూత్‌లో పలువురి ఓట్లు మిస్ అయ్యాయంటూ బీజేపీ నాయకులు ఓవరాక్షన్ చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియావళిని ధిక్కరించి సప్తగిరి సర్కిల్‌లోని కేఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల హైస్కూల్ ముందు రోడ్డుపై బైఠాయించారు. సీఐ జాకీర్ హుస్సేన్ బృందం ఆరుగురు బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగరంలోని 31 బూత్‌లలో ఓటింగ్ జరిగిన విషయం విదితమే. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఉదయం 8 గంటలకే కోర్టు రోడ్డులోని నెహ్రూ నగరపాలక పాఠశాలలోని 118వ బూత్ నంబర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా మండలి విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్ర రెడ్డి, ఆయన సతీమణి హరిత రాజేంద్ర నగరపాలక పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎంపీ తలారి రంగయ్య కేఎస్‌ఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పాతూరు నెంబర్ -2 పాఠశాలలో జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ ఓటును వినియోగించుకున్నారు. మేయర్ వసీం కోవూర్‌నగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లోని 116 బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగర మేయర్ వసీం నడవడానికి ఇబ్బందిగా ఉన్నా.. ఎటువంటి ఆర్భాటాలకు వెళ్లకుండా అరగంట పాటు క్యూలోనే నిలుచుని ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కోగటం శ్రీదేవి దంపతులు నగరంలోని నాల్గవ డివిజన్ రామచంద్రనగర్ చర్చి స్కూల్‌లో, ఉమానగర్‌లోని భారతి పాఠశాలలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మాజీ మేయర్ రాగే పరుశురాం, వైఎస్సార్ సీపీ సీనియర్ నేతలు చవ్వా రాజశేఖర్ రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, వైఎస్సార్ సీపీ నేత రమేష్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకన్నారు.

- నగరపాలక సంస్థ కమిషనర్ కే భాగ్యలక్ష్మి కేఎస్‌ఆర్ ప్రభుత్వ పాఠశాలలోని 122 బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నగరంలోని విద్యారణ్య స్కూల్‌లోని 116వ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఆకుతోటపల్లిలో పోలింగ్ ప్రశాంతం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లిలోని 121–సీ పోలింగ్ కేంద్రంలో సోమవారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 8 గంటలకు మందకొడిగా ప్రారంభమైనా.. ఆ తర్వాత పుంజుకుంది. ఈ పీఎస్ పరిధిలో మొత్తం 1262 ఓట్లు ఉండగా 823 మంది (63.21 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 586 మంది, మహిళలు 237 మంది ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా సాయంత్రం 4 గంటలకు పోలింగ్ సమయం ముగిసినా అప్పటికే దాదాపు 190 మంది దాకా క్యూలో ఉండడంతో వారందరికీ ఓటు హక్కు కల్పించారు. సాయంత్రం 5.35 గంటలకు పోలింగ్ ముగిసింది.



ఓటు హక్కు వినియోగించుకున్న రాగే పరశురాం



ఓటు హక్కు వినియోగించుకుంటున్న చవ్వా రాజశేఖర్ రెడ్డి

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



రాప్తాడులో ఓటు వేసేందుకు వెళ్తున్న పట్టభద్రులు



ఆత్మకూరు మండలకేంద్రంలో..

రాప్తాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో పట్టభద్రుల పోలింగ్ 70.1 శాతం, ఉపాధ్యాయుల పోలింగ్ 85.58 శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఓటు వేయడానికి ఓటర్లు బారులు తీరారు. మండలంలో పట్టభద్రులకు సంబంధించి 1,877 ఓట్లు ఉండగా 1,314 ఓట్లు పోలయ్యాయి. అలాగే ఉపాధ్యాయ ఓట్లు 104 ఉండగా 89 ఓట్లు పోల్ అయ్యాయి. జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప రాప్తాడులోని పోలింగ్ కేంద్రాన్ని ఉదయం 8 గంటలకు పరిశీలించారు. ముందుగా ఆయన ఓటర్ల దగ్గరకు వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. ఓటరు స్లిప్‌లు, ఐడీ కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అనంతపురం డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, ఇటుకులపల్లి సీఐ మోహన్, రాప్తాడు, ఇటుకులపల్లి ఎస్‌ఐలు ఆంజనేయులు, శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

విజయం మాదే

ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధిస్తారని ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి అన్నారు. ఆయన సోమవారం రాప్తాడులో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లలోనే విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు సామాజిక న్యాయం సాధ్యపడిందన్నారు.

ఆత్మకూరు: మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1,070 మంది ఉండగా 872 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 81.49 శాతం ఓటింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లు 44 మంది ఉండగా 38 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 86.36 శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలియచేశారు. సోమవారం ఉదయం జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లతో మాట్లాడారు. అలాగే జిల్లా చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఓటింగ్ సరళి గురించి తెలుసుకున్నారు. జిల్లా మాజీ చైర్ పర్సన్ తోపుదుర్తి కవిత ఆత్మకూరులో తన ఓటు వినియోగించుకున్నారు.

కనగానపల్లి: మండలంలోని పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 73.1 శాతం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 86 శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలో 969 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా 709 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక ఉపాధ్యాయ ఓటర్లు 22 మందికి గాను 19 మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాన్ని ధర్మవరం ఆర్డీఓ నాగరాజునాయక్, ధర్మవరం ఇన్‌చార్జ్ డీఎస్పీ హుసేన్ పీరా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్ వెంకటరమణ, ఎస్‌ఐ హనుమంతరెడ్డి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

రామగిరి: మండలంలో పట్టభద్రులు 627మంది ఉండగా 486 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 77.5 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఓట్లు 12 10 మంది ఓటును వినియోగించుకోగా 88 శాతం ఓటింగ్ నమోదైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ, ఆర్డీఓలు పోలింగ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. 49 మంది ఉపాధ్యాయులకు గాను 47 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 95.9 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే గ్రాడ్యుయేట్ ఓటర్లు 1,399 మందికి గాను 1,054 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 75.33 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాలను ధర్మవరం ఆర్డీఓ తిప్పేనాయక్, డీఎస్పీ హుస్సేన్ పీరా తనిఖీ చేశారు. రామగిరి ఎస్‌ఐ చిన్న గౌస్, ఎస్‌ఐ శ్రీధర్ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

ఓటమిని ఒప్పుకున్న ప్రతిపక్షాలు



ఇరిగేషన్ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఢీకొట్టడం చేతకాదని, ప్రజాబలం ఆ పార్టీకే ఉందని, మూడు రోజుల ముందే ప్రతిపక్షాలు ఓటమిని ఒప్పుకున్నాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో ఆయన పర్యటించారు. ఓటర్లెవరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులందరూ ఓట్లు వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలని పార్టీ శ్రేణులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా సుదీర్ఘ అనుభవమున్న తెలుగుదేశం పార్టీ ఓటు మార్పిడి పేరుతో వారి అభ్యర్థులను మోసం చేసిందని విమర్శించారు. ఐదారు నెలల పాటు అభ్యర్థులతో ప్రచారం చేయించి, చివరకు పీడీఎఫ్‌కు మద్దతుగా ఓటు వేయాలని టీడీపీ నాయకత్వం నిర్ణయించడంతో వారి దిగుజారుడుతనం మరోసారి బయటపడిందన్నారు. టీడీపీకి ఓటర్లపైనే నమ్మకం లేదన్నారు. టీడీపీ, పీడీఎఫ్‌లు ఎటువంటి ప్రభావం చూపలేరన్నారు. ప్రతిపక్షాలు చేసిన కుట్రలు మేధావులు, విద్యావంతులతో పాటు ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులు విజయం సాధిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గౌస్‌బేగ్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కనగానపల్లి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి సోమవారం కనగానపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ అధికారులు, ఏజెంట్లతో మాట్లాడి పోలింగ్ నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అందరూ అధికారులకు సహకారించాలని కోరారు. అనంతరం ఆయన స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులను కలసి పార్టీ కార్యకర్తలు, అభిమానులందరి చేత ఓటు వేయించి తమ గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను పలకరిస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

మెడికల్ విద్యార్థుల సందడి

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో అనంత ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున సందడి చేశారు. స్థానిక మెడికల్ కళాశాల ప్రాంగణంలో సోమవారం పాటకు అవార్డు కోసం పెద్ద ఎత్తున సందడి చేసిన విద్యార్థులు పాటకు అవార్డు ప్రకటించిన వెంటనే విద్యార్థులు ఇద్దరు ఇద్దరు జట్లుగా విడిపోయి పెద్ద ఎత్తున పాటకు స్టెప్పులు వేస్తూ సందడి చేశారు. తెలుగు పాటకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీనగర్ నుంచి కన్యాకుమారికి సైకిల్ యాత్ర

అనంతపురం కల్చరల్: శ్రీనగర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేస్తున్న దివ్యాంగురాలైన పారా సైక్లింగ్ చాంపియన్ గీతా ఎస్ రావు సోమవారం రాత్రి అనంత చేరుకున్నారు. నగర శివార్లలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఆమెకు సక్షం జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా మహిళా ప్రముఖ్ భాగ్యలక్ష్మి, అరుణ్ చైతన్య తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలో దివ్యాంగుల విశేషాలను ఆమెతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగుల ఆత్మస్థైర్యాన్ని సమాజానికి చాటడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు.